క్లుప్తంగా

వైద్యశిబిరం ఏర్పాటు



శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మక్కువ: మండలంలోని నంద, నందబొడ్డవలస గ్రామాల్లో శంబర పీహెచ్‌సీ వైద్యాధికారి రఘుకుమార్ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ వైద్యశిబిరంలో 63 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ప్రారంభం



ప్రాజెక్టు కార్యాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: బలిజిపేట, సీతానగరం మండలాలకు సంబంధించిన ఐసీడీఎస్ ప్రాజెక్టు కొత్త కార్యాలయం అద్దె భవనాన్ని ఎమ్మెల్యే జోగారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ కొత్త ప్రాజెక్టు ఏర్పాటైనందున వసతుల కల్పన, కేంద్రాల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సూపర్‌వైజర్లు, సిబ్బంది విధి నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా పనిచేయాలని సూచించారు. బలిజిపేట మండలంలో 94, సీతానగరం మండలంలో 88కేంద్రాలు దీని పరిధిలో ఉంటాయని సీడీపీఓ సుగుణ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి అనుపోత్సవం

సీతానగరం: మండలంలోని తామరఖండి పెద్దమ్మతల్లి అమ్మవారి అనుపోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. అనుపోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జమ్మాన ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వై శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం. మన్మథరావు, చినభోగిలి ఎంపీటీసీ జి.బుజ్జి, బక్కుపేట సర్పంచ్ జి అప్పారావు, పలుగ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

సీతంపేట: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. జిల్లాలో 21 పరీక్ష కేంద్రాల్లో మొదటి సంవత్సరం ఇంటర్‌విద్యార్థులు 11,318, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 10,945 పరీక్షలు రాసినట్టు సంబంధిత అధికారులు తెలిపారు.

సంత వేలం పాట ఖరారు

సీతంపేట: సీతంపేట వారపు సంత వేలం పాట బుధవారం ఖరారైంది. సంత వేలం పాటను రూ.4లక్షల 90 వేలకు తోయక అప్పారావు, రోజువారీ వేలం పాటను 72 వేల పది రూపాయిలకు హిమరక గిరి దక్కించుకున్నారు. మొత్తం 39 మంది వేలం పాటలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరిక కళావతి, డీఎల్‌పీఓ రాంప్రసాద్, ఈఓపీఆర్‌డీ కె.సత్యం, గ్రామ కార్యదర్శి సుదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీరంజని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో 40 సీట్లు, ఎనిమిదో తరగతిలో రెండు, 9వ తరగతిలో 2 సీట్లతో పాటు ఇంటర్మీడియెట్ హెచ్ఈసీ గ్రూపులో 40 సీట్లు చొప్పున ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఏప్రిల్ 20 వరకు ఏపికేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 79010 98513 ఫోన్ నంబరుకు సంప్రదించాలని కోరారు.

ఫీల్డ్ బుక్‌లు సిద్ధం చేయండి

భామిని: గ్రామాల్లో జరుగుతున్న గృహ నిర్మాణాలకు సంబంధించి ఫీల్డ్ బుక్‌లో విధిగా నమోదు చేయాలని హౌసింగ్ ఏఈఈ ఎల్.ప్రభాకరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ఇంజినీరింగ్ సహాయకులతో బుధవారం ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ పక్కా గృహాల కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు క్షేత్ర పరిశీలన ముఖ్యమన్నారు. ఇప్పటికే నిర్మాణాలు పూర్తి కావస్తున్న పీఎంఏవై గృహాలను దశల వారీగా గుర్తించాలన్నారు. ఉన్నతాధికారులు ఆదేశాలు వచ్చిన వెంటనే బిల్లుల చెల్లింపునకు రంగం సిద్ధంగా ఉంచాలన్నారు. హౌసింగ్ సిబ్బంది బి.రాంబాబు, టి.సునీల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను ఆశీర్వదించండి

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



సంక్షేమ పథకాలను గడగడపకు కార్యక్రమంలో వివరిస్తున్న ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ప్రజాసంక్షేమ, అభివృద్ధి పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి 2024 ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ప్రజలను కోరారు. ఈ మేరకు మండలంలోని కొత్తవలస పంచాయతీ గ్రామం ఎగువదాగరవలసలో సర్పంచ్ ఎస్.ధర్మావతి అధ్యక్షతన ఎంపీడీఓ పార్వతి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ గ్రామానికి వచ్చిన రాజన్నదొరకు ప్రజలు, నాయకులు ఘనస్వాగతం పలికి బ్రహ్మరథం పట్టారు.ప్రతి ఇంటికి వెళ్లిన రాజన్నదొర, జగనన్నపాలనలో ఇప్పటివరకు ఎంత మేరకు లబ్ధిచేకూరిందో వివరించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల పనితీరుపై ఆరా తీశారు. ఇళ్లు, పింఛన్లు, సీసీ రోడ్లు తదితర ప్రజల సమస్యలను విన్న ఆయన వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా రాజన్నదొర ప్రజలతో మాట్లాడుతూ, వివిధ సంక్షేమ పథకాల ద్వారా ముఖ్యమంత్రి అందిస్తున్న నగదును మహిళలు సద్వినియోగం చేసుకుని, ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు .సచివాలయం, వలంటీర్ వ్యవస్థల వల్ల ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని వివరించారు. వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని 2024 ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు.ప్రభుత్వ పాలనను వివరిస్తూ, ప్రజా సమస్యలు తెలుసుకుంటూ రాజన్నదొర ముందుకు వెళ్లారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ రెడ్డి సురేష్, జిల్లా గ్రంధాలయాల చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, ఏఎంసీ చైర్‌పర్సన్ దండిఅనంతకుమారి, నాయకులు దండి శ్రీనివాసరావు, కళ్లేపల్లి త్రినాథ, సంగంరెడ్డి జయసింహ ,బొన్నాడ సీతారాం , ఎస్.కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



సచివాలయభవనాన్ని ప్రారంభిస్తున్న రాజన్న దొర

సచివాలయం, ఆర్‌బీకేలను ప్రారంభం

మండలంలోని కొత్తవలసలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఉపముఖ్యమంత్రి గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర బుధవారం ప్రారంభించారు.సచివాలయం ,ఆర్‌బీకే వ్యవస్థలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఈ సందర్భంగా అభిప్రాయ వెలిబుచ్చారు.

రెండోరోజు స్వచ్ఛ సంకల్పం

శిక్షణా కేంద్రం సందర్శన



మాట్లాడుతున్న డీపీఓ సత్యనారాయణ

సీతానగరం: మండలంలోని పెదభోగిలి ఎస్‌డబ్ల్యూపీసీలో జరుగుతున్న స్వచ్ఛ సంకల్పం శిక్షణ తరగతులను డీపీఓ బి.సత్యనారాయణ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా తరగతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణకు గ్రామ వలంటీర్ల సహాయం తీసుకుని ప్రజల్లో పారిశుద్ధ్యం పట్ల అవగాహన కల్పించాలి. ఇంటి నుంచి చెత్త సేకరించి నప్పుడే తడిచెత్త, పొడిచెత్త వేరుచేసి క్లాప్ మిత్రలకు ఇచ్చేవిధంగా చేయాలి. తదుపరి ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌వద్ద ఎంపిక చేసిన తడిచెత్తనుంచి వర్మీకంపోస్టు తయారు చేయాలని, పొడిచెత్తను వేరుచేసి మండలానికి మంజూరైన ష్రెడ్డర్‌ను వినియోగించి ముక్కలుగా చేసి అమ్మకం చేయడం ద్వారా పంచాయతీ ఆదాయాన్ని సమకూర్చుకోవాలని స్పష్టం చేశారు. గరుగుబిల్లి మండల ఈఓపీఆర్‌డీ గోపాలరావు మాట్లాడుతూ మార్పు నెమ్మదిగా వస్తుందని, దానికి సచివాలయ సిబ్బంది కృషిచేయడం ద్వారా స్వచ్ఛమైన గ్రామాలను రూపొందించుకోవచ్చన్నారు. ప్రభుత్వం గ్రీన్ ట్రిబునల్ వంటి స్వచ్ఛంద విభాగాల ద్వారా పర్యావరణానికి హానిచేసే కార్యక్రమాలను నియంత్రిస్తుందని, అందులో భాగంగా రాబోయే కాలంలో చెత్త భారీగా కేంద్రీకృతమైనచోట భారీ పన్నులు వేసే అవకాశం ఉందని కావున స్వచ్ఛ సంకల్పంకోసం కృషిచేద్దామని పిలుపునిచ్చారు. సమావేశాన్ని స్థానిక సర్పంచ్ తేరే జమ్మ ప్రారంభిస్తూ స్వచ్ఛ సంకల్పం అందరి బాధ్యతఅని, పంచాయతీల్లో రాజకీయాలకు అతీతంగా అమలు చేయడానికి సంకల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెదభోగిలి ఈఓ వెంకట్రావు, జూనియర్ సహాయకులు రమేష్, కృష్ణరాయపురం కార్యదర్శి శ్రీనివాసరావు, ఆరు మండలాల కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు, వ్యవసాయ సహాయకులు, వెటర్నరీ సహాయకులు, క్లాప్ మిత్రలు హాజరయ్యారు.

చిన్నారులతో మమేకమైన సబ్ కలెక్టర్



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో ముచ్చటిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్

పాలకొండ రూరల్: సబ్‌డివిజన్ విధుల్లో నిత్యం బిజీగా ఉండే పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్ కొంత సమయం ఉపాధ్యాయునిగా మారిపోయారు. బుధవారం పాలకొండ మండలం లోవిడి లక్ష్మీపురం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అక్కడి పిల్లలతో మమేకమయ్యారు. అక్కడి పిల్లలతో సరదాగా గడిపారు. చిన్నచిన్న ప్రశ్నలు వేసి పిల్లల నుంచి సమాధానాలు రాబట్టారు. తన ఉద్యోగ స్థాయిని పక్కన పెట్టి సబ్‌కలెక్టర్ పిల్లలతో గడిపిన తీరు అక్కడి సిబ్బంది, గ్రామస్తులను ఆకర్షించింది. ఈ క్రమంలో అధికారి మాట్లాడుతూ కేంద్రాన్ని అంకితభావంతో నడపాలని సూచించారు.

సీతంపేట: మన్యంలో ప్రాథమిక విద్య బలోపేతానికి సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ కృషి చేస్తున్నారు. ఏజెన్సీ గ్రామాలను సందర్శించారంటే తప్పనిసరిగా ఏదో ఒక అంగన్‌వాడీ కేంద్రమో, ప్రాథమిక పాఠశాలనో తనిఖీ చేస్తుంటారు. చిన్నారులు ఎలా చదువుతున్నారు?, రాస్తున్నారనేదే పరిశీలిస్తారు. దీనిలో భాగంగా బుధవారం మండలంలోని సోమగండి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన ఓ చిన్నారితో ఆంగ్ల అక్షరమాల చదివించారు. ప్రీ స్కూల్ విద్యార్థులందరి చదువులను పరిశీలించారు.



సీతంపేట: సోమగండి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారితో ఆంగ్ల అక్షరాలు చదివిస్తున్న నూరుల్ కమర్

వైఎస్సార్‌సీపీలో 50 టీడీపీ కుటుంబాల చేరిక



వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: మండలంలోని కొత్తవలస గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాల వారు టడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో బుధవారం చేరారు. గ్రామానికి చెందిన చుక్క రామ్మూర్తి, పారమ్మ, దాలమ్మ, కృష్ణ, మజ్జి లచ్చయ్య, సంగంరెడ్డి లచ్చయ్య, ఆదయ్య తదితర 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వారికి ఉపముఖ్యమంత్రి ,గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సంగంరెడ్డి జయసింహ, బొన్నాడ సీతారాం, రెయ్యి గంగమ్మ, సాహు, శంకర్రావుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజన్నదొర మాట్లాడుతూ,అందరు ఐక్యంగా వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలని కోరారు. పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. 2024లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసేందుకు అందరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎస్.ధర్మావతి, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, జిల్లా గ్రంధాలయాల చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, ఏఎంసీ చైర్‌పర్సన్ దండిఅనంతకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు దండి శ్రీనువానరావు, కళ్లేపల్లి త్రినాథరావు, ఎస్.కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యాలను పూర్తి చేయండి



తంపటాపల్లి చెల్లెమ్మ కోనేటి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: గ్రామ స్థాయిలో చేపడుతున్న ఉపాధి పనుల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ డొంక త్రినాధులు అన్నారు. పాలకొండ మండలం తంపటాపల్లి, తుమరాడ తదితర గ్రామాల్లో జరుగుతున్న పనులను బుధవారం పరిశీలించారు. ముఖ్యంగా అమృత్ సరోవర్ పేరిట చేపడుతున్న చెరువు పనుల విషయంలో ఉపాధి క్షేత్ర సిబ్బంది అంకితభావంతో వ్యవహరించాలన్నారు. వేతనదారుల హాజరు, వారికి కల్పించాల్సిన కనీస వసతులు, వేసవి నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరా తీశారు. అవసరమైన సూచనలు చేసారు.

‘క్రాస్’తోనే నీటి ఎద్దడి నివారణ



క్రాస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ బాపూజీనాయుడు

గరుగుబిల్లి:

వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి నివారణకు గ్రామాల్లో క్రాస్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని ఉమ్మడి జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలో క్రాస్ ప్రోగ్రాంను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేలా బోరు బావులకు మరమ్మతులు నిర్వహించేందుకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. నెల రోజుల పాటు మండలంలోని అన్ని పంచాయతీల్లో ముందస్తు సమాచారంతో బోరు బావులను మరమ్మతులు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పైడితల్లి, జేఈ గౌరీశంకరరావు, కార్యదర్శి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో అదనపు సౌకర్యాలు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



గ్రంథాలయాలకు పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: గ్రంథాలయంలో అదనపు సౌకర్యాలను కల్పించినట్లు ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం పురపాలక సంఘం, బెలగాం ప్రాంతంలో గల గ్రంథాలయంలో అదనపు సౌకర్యాలను పెంపొందించి వాటిని ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు గ్రంథాలయం భవనం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రంథాలయంలో అవసరమైన అదనపు కుర్చీలు, బెంచీలతో పాటు పోటీ పరీక్షల పుస్తకాలు, నవలలు, కథల పుస్తకాలను పురపాలక సంఘం నిధులతో సమకూర్చి పాఠకులకు, యువతకు ఇబ్బంది లేకుండా గ్రంథాలయంలో వసతులు పెంపొందించినట్లు చెప్పారు. ఈ గ్రంథాలయంలో ఇంకా ఏమైనా అవసరం పడితే వాటిని కూడా తప్పక సమకూరుస్తామని అలానే అదనంగా గాలి పంకాలు కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. పార్వతీపురం అర్బన్ రూరల్ ప్రాంతాల నుంచి పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యే యువత అంతా ఈ గ్రంథాలయాన్ని చక్కగా వినియోగించుకుని అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు, అధికారులు, కౌన్సిలర్ సభ్యులు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, పాఠకులు, మున్సిపల్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పనుల్లో రైతులు



అప్పయ్యపేటలో తడిసిన జొన్నకండెలను ఆరబెడుతున్న రైతు ఆనందరావు



తామరఖండిలో కోతకు సిద్ధంగా మొక్కజొన్న పంట

సీతానగరం: ఆరుతడి పంటల్లో భాగంగా మండలంలోని రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటను ఇళ్లకు చేర్చే పనుల్లో ఉన్న సమయంలో అకాలవర్షాలకు తడిసి పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అప్పయ్యపేట, కొత్తవలస, గెడ్డలుప్పి, పెదంకలాం, రేపటివలస, బగ్గందొరవలస, తామరఖండి, లచ్చయ్య పేట, చినభోగిలి, లక్ష్మీపురం గ్రామాల్లో అరకొరగా నీటివసరులున్న భూముల్లో రైతులు ఖరీఫ్‌సీజన్‌లో వరికోత కోసిన భూముల్లో జీరో టిల్లేజ్ విధానం ద్వారా 120 హెక్టార్లలో మొక్కజొన్న సాగుచేశారు. పంట కోతకు రావడం, జొన్నపంట పక్వదశకు వచ్చిన సమయంలో ఈదురుగాలులతో కూడిన అకాలవర్షాల వల్ల పంట పడిపోవడం, కోసిన కండెలు తడిచి మొక్కబారడం, మడులలో పంట తడిసి పోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. జొన్నకండెలను కూలీలతో కళ్లాలకు చేర్చి ఆరబెట్టి ప్రభుత్వం రాయితీపై సమకూర్చిన యంత్ర పరికరాల ద్వారా జొన్న గింజలను వేరు చేస్తున్నారు. ఈ ఏడాది జొన్న పంటకు మద్దతు ధర ఉన్నప్పటికీ కొనుగోలు కేంద్రం లేక పోవడంతో దళారులకు విక్రయించాల్సి వస్తోందని అంటున్నారు. మండల కేంద్రంలో, ఆర్‌బీకేల ద్వారా జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు

ఈ విషయమై ఏఓ ఎస్.అవినాష్ వద్ద ప్రస్తావించగా ఇటీవల వర్షానికి పంట తడిసిపోయిందని, పాలు పోసుకున్న సమయంలో మొక్కజొన్న పంట పరిశీలించి నష్టాన్ని అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. రైతులు పండించిన మొక్కజొన్న పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుందని చెప్పారు.

మెనూ ప్రకారం ‘భోజనం’



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న జగనన్న గోరుముద్ద పథకం మెనూ ప్రకారం పెట్టాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం అమలును బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా భోజన వంటలను రుచి చూశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూను అమలు చేయకపోతే నిర్వాహకులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మెనూను అమలు చేయడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ పరిశీలనలో కార్యదర్శి కోటేశ్వరరావు తదితరులున్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు విధిగా పౌష్టికాహారాన్ని అందించాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని ఉల్లిభద్రలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ప్రతీరోజు గుడ్డు, పాలు, ఆకు కూరలు, కాయగూరలతో భోజనం అందించాలన్నారు.

ఆసరాతో ఆర్థిక స్వావలంబన

- ఎమ్మెల్యే జోగారావు



మహిళలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: వైఎస్సార్ ఆసరాతో మహిళల్లో ఆర్థిక స్వావలంబన కలుగుతుందని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. బలిజిపేట మండలంలోని వెంగాపురం సచివాలయం పరిధిలో మూడవ విడత ఆసరా నిధుల పంపిణీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరికం ఉండకూడదనే సంకల్పంతో పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేసినట్లు తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో చేసిన మోసంతో మహిళా సంఘాలు ఆర్థికంగా దెబ్బతిని నిర్వీర్యమయ్యాయన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు చేసిన పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఆసరా పథకం ద్వారా అప్పటి డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని అక్క, చెల్లెమ్మలను రుణ విముక్తులను చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పెట్టుకున్నారన్నారు.

మండలంలో పథకాలకు 268కోట్లు:

జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయిన తరువాత బలిజిపేట మండల ప్రజలకు వివిధ పథకాల ద్వారా రూ.268 కోట్లు అందాయని ఇది సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేసింది కాదా? అని ప్రశ్నించారు. ఇంత మేలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి వెంట అందరం నడవాలని పిలుపునిచ్చారు.

జగనన్నతోనే మహిళాభ్యున్నతి

సీఎం జగన్‌మోహన్ రెడ్డితోనే మహిళాభ్యున్నతి సాధ్యమవుతుందని పార్వతీపురం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకురాలు శోభాహైమావతి తెలిపారు. రుణాలు తీసుకుని కట్టలేని స్థితిలో ఉన్న మహిళలకు అండగా నిలిచి రుణాలను మాఫీ చేసిన వ్యక్తి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని తెలిపారు. అటువంటి మేలు చేసే వ్యక్తిని మరిచిపోవద్దని కోరారు. మహిళలకు అన్ని రకాలుగా పథకాలు అందజేస్తూ అండగా ఉంటున్న మన జగనన్నను మళ్లీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంగాపురం సర్పంచ్ అమ్మడమ్మ, ఎంపీటీసీ మురళి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, పార్టీ మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, ఎంపీడీఓ భానుమూర్తి, ఏపీఎం ఉమామహేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హాజరైన మహిళలు

పాడిపరిశ్రమతో అభివృద్ధి



ఆసరా పథకం ద్వారా మూడు విడతల్లో నాకు రూ.56,200లు వచ్చాయి. గ్రూపులో వచ్చిన రుణాలు, మాఫీల ద్వారా వచ్చిన మొత్తంతో పశువులను కొనుగోలు చేసుకుని జీవనం సాగిస్తున్నాను. — కె.రాజేశ్వరి, అజ్జాడ

చింతలేని జీవనం



మూడు విడతల్లో వచ్చిన ఆసరా, వివిధ పథకాల ద్వారా వచ్చిన డబ్బులతో పిల్లలను చదివించుకున్నాను. వారు పనికివచ్చారు. నేను ఎంతో సంతృప్తిగా చింతలేని జీవితం గడుపుతున్నాను. — ఉమాదేవి, పలగర గ్రామం